

పులిమామిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ జయశ్రీ

## నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలి

- తాసీల్దార్ జయశ్రీ

హాలియా, ఆక్టోబర్ 20 : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తాసీల్దార్ జయశ్రీ కోరారు. శుక్రవారం మండలంలోని రామడుగు, పులిమామిడి, శ్రీనాథపురంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కళావతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



జానారెడ్డి మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా కనిపించిన కుర్చీలు

## కాంగ్రెస్ సభ వెలవెల

- జన బలం లేక కిరాయికి కూలీలు
- తిరుమలగిరి సాగర్‌లో జానారెడ్డి మాట్లాడుతుండగానే జనం తిరుగుముఖం

హాలియా, అక్టోబర్ 20 : తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ సభ జనంలేక వెలవెలబోయింది. స్థానికంగా జన బలం లేకపోవడంతోఆ పార్టీ నాయకులు గ్రామాల్లో అద్దె కూలీలను తీసుకొచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు తిరుమలగిరి సాగర్‌లో కాంగ్రెస్ నాయకులు భారీ సభను ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల మండలాలు, తండాలు, గ్రామాల నుంచి డబ్బులు ఇచ్చి జనాన్ని పోగు చేశారు. డబ్బులు తీసుకొని సభకు హాజరైన జనం, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఒక్కొక్కరుగా లేని వెళ్లిపోయారు. కాసేపటికి జానారెడ్డి ప్రసంగం ప్రారంభం కాగా ఖాళీ కుర్చీలను చూసి రంగుతిన్నారు.



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం

హాలియా, ఆక్టోబర్ 20 : దేవీ శరన్నరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ యడవల్లి అనుపమాయుగేందర్‌రెడ్డి, మేడ వెంకట్రాంరెడ్డి, పేరూరి గోవింద్, ఆలయ అర్చకుడు రాఘవాచార్యులు పాల్గొన్నారు.

## దుర్గాభవానికి ప్రత్యేక పూజలు

పెద్దవూర, అక్టోబర్ 20 : మండలంలోని వెల్మగూడెంలో దుర్గమాతకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డీవీఎన్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావుల శ్రీను పాల్గొన్నారు.



దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డీవీఎన్ రెడ్డి

# సాగర్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురాలి

- ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలి
- హైదరాబాద్‌లో నియోజకవర్గ ముఖ్యనేతలు, కార్యకర్తలతో మంత్రి కేటీఆర్
- హాజరైన ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు



పెద్దవూర మండలంలో పెండింగ్ పనులపై మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకార్ చైర్మన్ రామచంద్రానాయక్

హాలియా, అక్టోబర్ 20 : జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జున సాగర్ నియోజకవర్గం గడ్డపై గులాబీ జెండా ఎగుర వేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ నాయకత్వంలో సుమారు 1,500 మంది బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. వారితో సమావేశమమైన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలను వివరిస్తూ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో జరిగేవి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసే ఎన్నికలన్నారు. అందుకు అంతా కలిసిమెలిసి పనిచేయాలన్నారు. పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీలు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాంచందర్ నాయక్ ఎమ్మెల్యేతో కలిసి ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని, గ్రామాలకు వెళ్లి ఎన్నికల కోసం కొత్తగా బూత్ కమిటీలు వేయాలని సూచించారు. బూత్ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన పార్టీ మ్యానిపెస్టో అందజేయడంతో పాటు పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుంటారో.. ఈ ఎన్నికలను కూడా అంతే సీరియస్‌గా తీసుకుని పనిచేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల హృదయాల్లో ఉన్నారని, నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్నదన్నారు. చిన్న చిన్న విభేదాలను పక్కకు పెట్టి బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలన్నారు. దసరా పండుగ తర్వాత వీలు చూసుకుని తాను కూడా నాగార్జున సాగర్ నియోజకవర్గానికి రానున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు ఉన్నారు.



హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

## ప్రజల మద్దతు నాకే..

- నాలుగేండ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 20 : హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నాలుగేండ్లుగా అవిశ్రాంతంగా కృషి చేశానని ప్రజల మద్దతు తనకే ఉందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 2018లో పోటీ చేసినపుడు ఒంటరిగా ప్రజల్లోకి వెళ్లి కేవలం ట్రక్కు గుర్తు వల్ల స్వల్ప తేడాతో ఓడినట్లు తెలిపారు. అవకాశ వాదులకు వారి స్వార్థ ప్రయోజనాలే ముఖ్యమని వారికి ప్రజా క్షేత్రంలో మనుగడ లేదని పార్టీని మారుతున్న నాయకులను ఉద్దేశించి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కనపెట్టి శ్రమించానన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల మధ్యే ఉండి వారికి సేవ చేశానన్నారు. నాలుగేండ్ల నియోజకవర్గ అభివృద్ధి తన పనితీరుకు నిదర్శనమన్నారు. ఎవరెటు పోయినా ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో పేద వర్గాలకు మేలు చేసేలా ఉందని కొనియాడారు. 31న నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు, నాయకులు కదిలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, బెల్లకొండ అమర్, కేఎల్ఎన్‌రెడ్డి, మన్యం శ్రీనివాస్‌రెడ్డి, కడియం వెంకట్‌రెడ్డి, ములకలపల్లి రాంబాబు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

గరిడేపల్లి : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని సర్వారం గ్రామంలో లక్ష్మీనర్సింహ భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఏపీ రాష్ట్ర స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి : బొమ్మలరామారం ఎంపీపీ సుధీర్‌రెడ్డి

బొమ్మలరామారం, అక్టోబర్ 20 : బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్ అన్నారు. మండలంలోని కంచల్ తండా, రామస్వామితండాలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ గ్రామశాఖల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతపై చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ శ్రీనివాస్, గొడుగు చంద్రమౌళి, గుర్రాల లక్ష్మారెడ్డి, రాజన్ నాయక్, నవీన్ గౌడ్, జూపల్లి భరత్ పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు

నందికొండ, అక్టోబర్ 20 : కుటుంబ సభ్యులపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ హిల్‌కాలనీకి చెందిన యాదగిరి తన తండ్రి శ్రీరాములు, తల్లి భీమమ్మ, అక్క పద్మపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగం చేయాలి

- చింతలపాలెం ఎంపీపీ వెంకట్‌రెడ్డి

చింతలపాలెం, అక్టోబర్ 20 : గ్రామల్లో అభివృద్ధి పనులు వేగం చేయాలని ఎంపీపీ కొత్తమద్ది వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో హరితహారం, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టిన పనుల నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జోగు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పొల్నేడి శ్రీనివాస్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొత్తమద్ది వెంకట్‌రెడ్డి